# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనలో భాగంగా ఈరోజు పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు.**

**2. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఈరోజు పర్యటిస్తున్నారు.**

**3. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**4. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ లోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసిన నిధుల్లో 51 శాతం రాయలసీమకే కేటాయించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన కొనసాగుతోంది. రెండవ రోజైన ఈరోజు పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి అభివృద్ధి, సెమీకండక్టర్ రంగ విస్తరణ లక్ష్యంగా అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ఆయన చర్చలు జరపనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి వరల్డ్ సిటీస్ సదస్సులో కీలకోపన్యాసం చేయనున్నారు. మధ్యాహ్నం సింగపూర్ ఉప ప్రధానమంత్రి గాన్ కిమ్ యోంగ్ తో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొని పెట్టుబడిదారులతో ముఖాముఖి సమావేశమవుతారు.

--------------------------

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఈరోజు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ఉదయం వన్‌టౌన్‌లోని వాజ్‌పేయి పార్కును సందర్శించి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు మొక్కలు నాటనున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో “చాయ్ పే చర్చ” కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన రాయనపాడు రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడి సౌకర్యాలు, అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. కేంద్రమంత్రికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ అంత్యోదయ సిద్ధాంతంతో ప్రభుత్వ ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన

సాగుతోందన్నారు.

వాయిస్..30.. సెకన్లు

---

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అన్ని శాఖల అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాల జాబితాను సిద్ధం చేసి కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే విద్య, వైద్య శాఖల్లో ముఖ ధృవీకృత హాజరు విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

---

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోని ఎల్‌సీకేపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సహాయ ఉపకరణాలను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన వారు స్వావలంబనతో జీవించేలా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ అభియాన్ ద్వారా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30..సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు నుంచి జులై 31వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని ఐదేళ్లలోపు 37 లక్షల 53 వేల 850 మంది చిన్నారులకు ఉచితంగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. చిన్నారులు ఉన్న ఇళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆశా కార్యకర్తలు వెళ్లి వీటిని అందజేస్తారని చెప్పారు. అతిసార నివారణపై అవగాహన కల్పించేందుకు సబ్బుతో చేతులు కడుక్కోవడం, సురక్షిత తాగునీటి వినియోగం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

---

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంత ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాయలసీమ లిఫ్ట్ సాధన కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు కీలకమని పేర్కొన్నారు.

రాయలసీమలో నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి, ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

---------------------------

గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ లోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసిన నిధుల్లో 51 శాతం రాయలసీమకే కేటాయించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. కర్నూలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ గాజులదిన్నె, వేదవతి, గురు రాఘవేంద్ర వంటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి శాశ్వతంగా సాగు, తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తుంగభద్ర డ్యామ్ గేట్ల పునరుద్ధరణ, శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, హంద్రీ–నీవా ప్రాజెక్టు అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి వివరిస్తూ..

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

వర్షాకాలంలో ప్రబలే కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో కాలానుగుణ వ్యాధులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే వాటి వ్యాప్తిని ముందుగానే అరికట్టడమే ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ద్రోణి దక్షిణ కోస్తాంధ్ర మీదుగా తమిళనాడు వరకు విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలోనూ పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశంఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================